క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పుల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పానుగపాడు, మేరికపూడి, మునగపాడు, గుండాలపాడు, బేతపూడి, ఫిరంగిపురం, రేపూడి, వేమవరం, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, యర్రగుంట్లపాడు, కండ్రిక, తక్కెళ్లపాడు గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంతతకు సహకరించండి

సీఐ షేక్ సుభానీ

వడ్డమాను(తాడికొండ): ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రశాంతతకు సహకరించాలని తుళ్లూరు సీఐ షేక్ సుభానీ సూచించారు. తుళ్లూరు మండలం వడ్డమానులో ఇరువర్గాలతో విడివిడిగా శాంతి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు తగిన సేవలందించేందుకే పోలీసు శాఖ ఉందని, సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఎదురైతే మా దృష్టికి తీసుకొస్తే సత్వరం పరిష్కరిస్తామన్నారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని శనివారం శాంతికల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ జి.రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, స్వామివారికి నాగవల్లీ దళార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి శాంతికల్యాణం నిర్వహిస్తారన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కోరం లేక పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

తాడికొండ: కోరం లేక తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం వాయిదా పడింది. మొత్తం 19 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎంపీపీతో సహా 4 మాత్రమే హాజరవగా, 4 సర్పంచులు మాత్రమే సభకు రావడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ అనూరాధ ప్రకటించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి గాబులు శుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రిజ్‌లు వారానికోమారు శుభ్రంగా తుడుచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రతతో పాటు, ఎండిన కొబ్బరిబోండాలు, పాత టైర్లు నిలువ ఉంచకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో నీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలెవెన్స్ ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం దుగ్గిరాల గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మే నెలలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, కాబట్టి వారికి అలవెన్స్ అమలు చేయాలని, మంచినీరు, టెంట్, మెడికల్ కిట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండల గ్రామాల్లో ఇప్పటికీ పలుగు, పార అందజేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సుబ్బారావు, వరదయ్య, చెంచు రాజు, భాగ్యలక్ష్మి, పద్మశ్రీ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుందులరోడ్డులో సుమారు 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831346 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యం

- అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయిస్తున్నాం
- పైప్‌లైన్లు కూడా క్లీనింగ్ చేస్తున్నాం
- ఎంటీఎంసీలో హౌస్ ట్యాప్‌ల వద్ద వాటర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం
- ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్



తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాగునీరు కలుషితం కాలేదని, ప్రతి నెల కార్పొరేషన్ పరిధిలో ఉన్న వాటర్ ట్యాంకులను, పైపులైన్లను క్లీనింగ్ చేస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ శుక్రవారం తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, డీఈ కృష్టారెడ్డి, ఏఈల సమక్షంలో కార్పొరేషన్ పరిధిలో ఉన్న 31 ఓవర్‌హెడ్ ట్యాంకులను ఇప్పటికే పరిశీలించారని, ప్రతి ప్రాంతంలో ట్యాంకుల క్లీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఒక పక్క ట్యాంకులు క్లీనింగ్ చేస్తూనే మరోపక్క ఆయా ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లను కూడా క్లీనింగ్ చేపట్టామని వివరించారు. గతంలోనే ప్రతి పైపులైను క్లీన్ చేయడానికి శివారు భాగంలో ఔట్‌లెట్లు ఏర్పాటు చేశామని, ముందుగా పైపులైన్‌లోకి బ్లీచింగ్ పంపించి, రెండు మూడు గంటల తరువాత అవుట్‌లెట్‌లు ఓపెన్ చేసి ఆ నీటిని బయటకు పంపడంతో పాటు ఫ్రెష్ వాటర్‌ను కూడా బయటకు వదులుతున్నామని, పైపులైన్లలో ఎక్కడా డస్ట్ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే పైపులైన్లపై దృష్టి సారించి మరమ్మతులు కూడా చేశామని, వీటితో పాటు కార్పొరేషన్ పరిధిలోని 50 సచివాలయాల ఎమినిటీలు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికి తిరిగి కార్పొరేషన్ తాగునీటిని ఉపయోగిస్తున్న నివాసాల్లో నీటిని పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు వచ్చిన శాంపిల్స్‌లో ఎటువంటి లోపం లేదని, రాబోయే వర్షాకాలంలో వ్యాధులను నివారించేందుకు ఇప్పటి నుండే జాగ్రత్తలు తీసుకుని తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

నేటితో ముగియనున్న వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం నేటితో ముగియనున్నదని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ 22 రోజుల పాటు నిర్వహించిన బాలల వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగియనున్నదని, ఆదివారం ముగింపు సభను ఏర్పాటు చేసి శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌ను అందజేస్తామని, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నామని వారు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులతో నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామని, ఈ ముగింపు సభకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డాక్టర్ రావి శారద, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ తాడేపల్లి అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహనరావు, బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అమరావతి ఐకాన్ మిత్ర బృందం యడ్ల బాలకృష్ణ తదితరులు హాజరు కానున్నారని వివరించారు.

ఘనంగా హీరో కృష్ణ జయంతి వేడుకలు



కృష్ణ చిత్రపటం పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్: నటుడు, నిర్మాత సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం దుగ్గిరాల గ్రామంలోని జెండాచెట్టు సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మట్లాడుతూ సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ ఈ జిల్లావాసిగా సినిమా రంగంలో ప్రవేశించి అగ్ర నటుడుగా ఎదిగి ఎన్నో విప్లవాత్మకమైన పాత్రలు పోషించి, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎవ్వరూ చేయలేని ప్రయోగాలు చేసి డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా పేరుగాంచారని అన్నారు. కార్యక్రమంలో షేక్ జాన్ సైదా, షేక్ సమీఉల్లా, ఖాదర్ బేగ్, మహమ్మద్ అయూబ్, మహమ్మద్ హనీఫ్ బేగ్, కాకా వెంకటేశ్వర్లు, మునిపల్లి కుమార్, బొద్దులూరి వెంకటేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన బస్సు, క్రేన్ ముందు భాగం

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సు, క్రేన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలవగా రెండు వాహనాలూ ధ్వంసమయ్యాయి. స్థానిక యడ్ల లింగయ్య పెట్రోలు బంకు రోడ్డులోని ఆషా థియేటర్ వద్ద పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. గుంటూరు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణీకులని దించి బస్ స్టేషన్ వైపుకు వెళుతుండగా ప్రియ డీలక్స్ వైపు నుంచి క్రేన్ రోడ్డు పైకి రావడంతో అదే సమయంలో అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు క్రేన్‌ని ఢీ కొట్టింది. క్రేన్ ముందు భాగం, టైర్ పగిలి పోయింది. ఇదే సమయంలో క్రేన్ పక్కగా స్కూటీపై వెళుతున్న షేక్ అఫీబా, రాజశేఖర్ లకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మరొక ఆర్టీసీ బస్సును ఒవర్‌టేక్ చేసి అతివేగంగా రావటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని క్రేన్ యజమాని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంలో క్రేన్ సహా ఆర్టీసీ బస్సు ఎడమ భాగం పాక్షికంగా ధ్వంసమైంది. అంత పెద్ద ప్రమాదం జరిగినా ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంపీపీ పద్మావతి, ఏఎంసీ చైర్మన్ రవిదేవరాజు

గుంటూరు రూరల్: గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని ఎంపీడీఓ ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రూరల్ మండలం సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గతంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా రానున్న కాలంలో చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మౌలిక వసతులు కల్పన ఎంతో అవసరమని చెప్పారు. వేసవిలో ప్రజా సమస్యలు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మండల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ళ రవిదేవరాజు, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీటీసీలు భూలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, ఇంటూరి అంజిరెడ్డి, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, ముక్కమళ్ళ సాంబిరెడ్డి, సర్పంచ్‌లు మబ్బు శిరీష, నల్లమేకల అప్పమ్మ, మాధవరావు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్‌లోని అన్నదాన సమాజం ఆడిటోరియం ఆవరణలో శుక్రవారం రాత్రి ఆర్ఎస్ ఈవెంట్స్ 18వ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి అధ్యక్షతన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ బిళ్ళ అశోక్, ఉన్నం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ, గాయకులు మునిపల్లె రమణి, శనివారపు శిరీష, బెల్లంకొండ భారతి, డాక్టర్ సుశీల్‌కుమార్, పత్రి లలిత్ బాబులు సూపర్ స్టార్ కృష్ణ, వివిధ చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై సురేష్, జెర్మియ, తబలాపై రమణ, విజయ్ పాల్ ప్యాడ్స్, లక్ష్మణ్ వాయిద్య సహకారం అందించారు. అనంతరం సూపర్ స్టార్ కృష్ణ జయంతి, రమణి పుట్టిన రోజు సందర్భంగా కేక్‌లు కట్ చేయగా, మూర్తి వార్షికోత్సవ వేడుకలను పర్యవేక్షించారు.

నేటి నుంచి 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు

సీఐ ప్రభాకర్‌రావు

తాడికొండ: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శనివారం నుంచి తాడికొండ మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం తాడికొండ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు గాను తమ శాఖ నుంచి తాడికొండ మండలంలో వివాదాస్పద వ్యక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఇప్పటికే 40 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు మండల పరిధిలో సభలు, ర్యాలీలు, విజయోత్సవాలు, ఊరేగింపులు నిషేధమని, సోషల్ మీడియాలో అనుచితంగా రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. 3, 4, 5 తేదీలలో మద్యం దుకాణాలు మూసివేయడంతో పాటు లూజు విక్రయాలపై కఠిన ఆంక్షలు ఉంటాయి కనుక గ్రామాల్లో ఎక్కడైనా లిక్కర్ విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పెట్రోల్ బంకుల్లో లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలు నిషేధమని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇప్పటికే అన్ని గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పికెట్‌తో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎస్ఐలు రవీంద్ర బాబు, అంజయ్య పాల్గొన్నారు.

భవిత కేంద్రాల బలోపేతానికి సర్వే



తాడికొండ: రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ఏర్పాటైన భవిత కేంద్రాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ 9వ తేదీ వరకు జిల్లాలోని 18 మండలాల సహిత విద్యా విభాగం సిబ్బంది, ఐఈఆర్‌పీలు, మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలోని ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీల సహకారంతో ఇంటింటికీ సర్వే చేస్తున్నారు. తుళ్లూరు మండలంలో కొనసాగుతున్న సర్వేలో ఐఈఆర్‌పీలు ఆర్ ఉషారాణి, కె.దేవీ ప్రియ పాల్గొన్నారు.

పొగ తాగేవారిలో షుగర్ వ్యాధి వచ్చే అవకాశం

గుంటూరు మెడికల్: పొగ తాగేవారిలో షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, 30 నుంచి 40 శాతం షుగర్ వ్యాధి రావచ్చని షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. నో టుబాకో డే సందర్భంగా శుక్రవారం స్థానిక కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ పొగ తాగడం వలన గుండె వ్యాధులు వస్తాయని, కిడ్నీలు ఫెయిల్ అవుతాయని, చూపు మందగిస్తుందని చెప్పారు. కాళ్లల్లో రక్త ప్రసరణ తగ్గిపోయి, కాళ్లల్లో చురుకు మంటలు వస్తాయని హెచ్చరించారు. ధూమపానం వదిలేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పొగ తాగే వారికి నిద్ర సరిగా పట్టదని చెప్పారు. షుగర్ ఉన్నవారు సిగరెట్ తాగడం వల్ల షుగర్ నియంత్రణలో ఉండదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని చెప్పారు.

టెన్త్‌లో పాఠ్యాంశాల బోధనపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతిలో కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డీవైఈఓ కె.దశపతిరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) ఆధ్వర్యంలో శుక్రవారం అరండల్‌పేట మూడో లైనులోని యోగిభవన్‌లో సంఘ జిల్లా అభ్యాసనవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న దశపతిరావు మాట్లాడుతూ టెన్త్‌లో మారిన పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.బాల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, నాయకులు డి.నాగ భారతి, డి. శివపార్వతి, మురళీకృష్ణ, వై.రమ, ఆదినారాయణ, డి.రామాంజనేయులు, కిషోర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు కౌంటింగ్ కేంద్రానికి

నిర్ణీత టైమ్‌కు చేరుకోవాలి

- ఉదయం 7 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తి
- తరువాత మొదటి రౌండు లెక్కింపు ప్రారంభం
- తాడికొండ ఆర్వో గంగరాజు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగరాజు

తాడికొండ: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు వచ్చే ఉద్యోగులు తెల్లవారుజామున ఐదు గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు ఆదేశించారు. తాడికొండ షిరిడి సాయి, పర్తిసాయి మందిర కల్యాణ మండపంలో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌కు ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ 3వ తేదీ సాయంత్రం ర్యాండమైజేషన్ ద్వారా జిల్లా అధికారులు నిర్ణయిస్తారన్నారు. వీరంతా ఉదయం కౌంటింగ్ కేంద్రానికి చేరుకుంటే విధులను కూడా ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరుగుతుందని చెప్పారు. 7 గంటల లోగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తి చేసి ఈవీఎం కౌంటింగ్ ప్రారంభించడం ద్వారా ఎన్నికల ఫలితాలు త్వరగా పూర్తిచేయవచ్చు కనుక సమయపాలన తప్పనిసరి అన్నారు. కౌంటింగ్ రోజున ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏమైనా అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా తప్పనిసరిగా తన దృష్టికి తీసుకొస్తే జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈవీఎంల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే శిక్షణలో తెలియజేయడం జరిగిందని, తప్పని సరిగా నిబంధనల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ఎం.మధుసూదనరావు, సుధీర్ బాబు, రాజ్యలక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్లు కాకుమాను ప్రసాద్, మోహినీ కుమారి పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై హనుమజ్జయంతి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాలతో విశేష అభిషేకం, మన్యుసూక్త హోమం, ప్రత్యేక అలకంరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. సాయంత్రం తమలపాకులతో స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, మడమాల సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. శనివారం హనుమాన్ జన్మోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పరిశీలిస్తున్న జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు

ఫిరంగిపురం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపవిద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో వివిధ పాఠశాలల్లో పనిచేసే ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండటంతో వంటగది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడవద్దని చెప్పారు. శిక్షకురాలు ప్రవీణ పాఠశాలలో భోజన పథకాన్ని ఏవిధంగా నిర్వహించాలో, రుచికరమైన పదార్థాలు ఏవిధంగా తయారు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహబూబ్ సుభానీ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పోలీస్ సిబ్బందికి సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలను సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సుదీర్ఘ కాలం క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని జిల్లా ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు అన్నారు. డీసీఆర్బీ ఎస్ఐ రామబ్రహ్మం, ఆర్ఎస్ఐ వి.వెంకటరావు, ఏఎస్ఐలు ఎన్.వెంకటేశ్వరరావు(నల్లపాడు), దుర్గాప్రసాద్ (అరండల్‌పేట), మల్లికార్జునరావు (తెనాలి ఒన్‌టౌన్), హెడ్‌కానిస్టేబుళ్లు పీవీ నరసింహారావు (తెనాలి ఒన్‌టౌన్), నాగేశ్వరరావు(తెనాలి త్రీటౌన్) శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ మాట్లాడుతూ శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరిరెడ్డి, జిల్లా పోలీసు సంఘం ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్, మైలా సాంబశివరావు పాల్గొన్నారు.